# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త




## శ్రీచెంగాళమ్మ తిరునాళ్లకు రెండవ చాటింపు

సూళ్లూరుపేట, జూన్ 3 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలో ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్న శ్రీచెంగాళమ్మ తిరునాళ్లకు సంబంధించి రెండవ చాటింపును శుక్రవారం అర్ధరాత్రి వేశారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డిలు అమ్మణ్ణి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రెండో చాటింపు వేసేందుకు పట్టణంలోకి వెళ్లారు. ఆలయ పూజారులు చాటింపు వేసేందుకు పట్టణంలోని పలు గమెట్లలో పూజలు చేసి అష్టదిగ్బంధనం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు బండి సునీత, ఎంఎం పద్మజ, నాయుడుకుప్పం నాగమణి, కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముత్యపుకవచంలో మురిసిన మలయప్ప



తిరుమల, జూన్ 3ప్రభాతవార్తప్రతినిధి:

వెంకన్న ఆలయంలో జరుగుతున్న జ్యేష్టాభిషేకాల్లో శనివారం ఉదయం శాస్త్రోక్తంగా విశేష తిరుమంజనం అనంతరం శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామికి ముత్యపుకవచం సమర్పణ చేశారు. ఆలయ అర్చకులు, వేదపండితులు వేదోక్తంగా శ్రీసూక్తం, భూసూక్తం, పురుషసూక్తం, నీలాసూక్తం, నారాయణసూక్తాలను పఠిస్తూవేదపఠనాలతో మహాశాంతిహోమం నిర్వహించారరు. సాయంత్రం ఆలయ మాఢవీధుల్లో ముత్యపుకవచంలోనే ఊరేగారు.

## డబ్బు ఇవ్వలేదని..
# తండ్రిని హతమార్చిన మైనర్ బాలుడు

### - చింతకుప్పంలో సంఘటన !!



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య, కుటుంబీకులు

కుప్పం(రామకుప్పం) జూన్ 3 ప్రభాతవార్త

కూలీపనులకు వెళ్లి రాగా వచ్చిన నగదును తనకు ఇవ్వాలని తండ్రిని మైనర్ బాలుడు కోరగా తండ్రి ఇవ్వకపోవడంతో ఆవేశంతో తండ్రి తలపై కర్రతో మైనర్ బాలుడు మోదిన నేపథ్యంలో తండ్రి మృతి చెందిన సంఘటన శనివారం రామకుప్పం మండలం చింతకుప్పంలో చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి ఇన్‌చార్జ్ ఎస్సై లక్ష్మీకాంత్ తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని చింతకుప్పంకు చెందిన సుబ్రమణ్యం (42) కూలీ పనులు చేసేవాడు. ఇతని కుమారుడు (17) శనివారం సాయంత్రం తన తండ్రిని డబ్బు అడిగాడు. కుమారుడికి డబ్బు ఇస్తే దుబారాగా వ్యసనాలకు ఖర్చు చేస్తాడని భావించి సుబ్రమణ్యం తన కుమారుడికి డబ్బు ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో సుబ్రమణ్యం కుమారుడు క్షణికావేశంలో తన తండ్రి తలపై కర్రతో బలంగా కొట్టాడని దీంతో తీవ్ర రక్తస్రావమై సుబ్రమణ్యం అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. సంఘటనా స్థలాన్ని రూరల్ సిఐ రియాజ్ అహ్మద్, ఇన్‌చార్జ్ ఎస్సై లక్ష్మీకాంత్‌లు పరిశీలించారు. మృతదేహంను పంచనామా నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై

## పద్మావతి పాహిమాం..



తిరుచానూరు, జూన్ 3, ప్రభాతవార్త

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో శనివారం శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పపై విహరించి భక్తులను కటాక్షించారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొల్పి, సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 3.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు పద్మ పుష్కరిణి వద్ద గల నీరాడ మండపంలో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో అమ్మవారి మూడు చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు సర్వాంగ సుందరంగా అలంకరించిన అమ్మవారు తనకు ఎంతో ప్రీతి పాత్రమైన గజ వాహనంపై తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందా రాజన్, ఏవిఎస్‌వో శైలేంద్ర బాబు, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, మధు, ఆలయ అర్చకులు టెంపుల్ ఇన్స్పెక్టర్స్ సుభాష్, గణేష్, ప్రసాద్, అశోక్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# పగలు రెక్కీ.. రాత్రి చోరీ

### పాతనేరస్తుడు అరెస్టు



తిరుపతి క్రైం, జూన్ 3, ప్రభాతవార్త

పగలు రెక్కీ రాత్రి చోరీ చేస్తున్న సంఘటన తిరుపతి రూరల్ పరిధిలోని మంగళం వద్ద చోటు చేసుకుంది. శనివారం జిల్లా పరమేశ్వర రెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 9 దొంగతనాలకు పాల్పడిన ముద్దాయి విశాఖపట్నంకు చెందిన నకల శ్రీను అలియాస్ నల్లశ్రీను (34) అరెస్టు చేసారు. తిరుపతి రూరల్ మంగళంలో వెంకటేశ్వర కాలనీ వాటర్ ట్యాంక్ దగ్గర డోర్ నెంబర్ 6-205 దొంగతనం జరిగింది. 793 గ్రాముల బంగారు ఆభరణములు, 1235 గ్రాములు గల వెండి వస్తువులు స్వాధీనం, వాటి విలువ సుమారు రూ. 40,00,000 వుంటుందన్నారు. ఈ నెల 2వ తేది జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి డిఎస్పి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అలిపిరి సిఐ అబ్బన్నకి వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ చిన్న రెడ్డప్ప సిబ్బంది కలిసి తిమ్మినాయుడు పాలెం బస్ స్టాప్ వద్దకు వెళ్లగా అక్కడ ఒక వ్యక్తి నిలబడి వుండి పోలీసు వారిని చూసి మంగళం వైపు పరిగెత్తుకుంటూ పారిపోవుటకు ప్రయత్నించడం జరిగిందన్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు చాకచక్యంగా చుట్టుముట్టి అతనిని పట్టుకొని, అదుపులోకి తీసుకుని విచారించగా, అతను చెడు వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో తిరుపతి నగరంలోని పలుప్రాంతాలలో తాళము వేసి ఉన్న ఇళ్ల దగ్గర పగటి పూట రెక్కి నిర్వహించి, రాత్రి పూట ఇంటి తాళమును పగులకొట్టి, లోపలికి ప్రవేశించి, సదరు ఇళ్ళల్లో ఉన్న బంగారు ఆభరణములను, వెండి వస్తువులను దొంగిలించి, సదరు బంగారు ఆభరణములు గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి, సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. 40 లక్షల విలువ చేసి 793 గ్రాముల బంగారం 1.235 గ్రాముల వెండి స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసారు. అదనపు ఎస్పిలు వెంకటరావు పరిపాలన, తిరుపతి డిఎస్పి సురేంద్ర రెడ్డి, అలిపిరి పోలీస్ స్టేషన్ సిఐ అబ్బన్న, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.












## ఉపాధ్యాయుల పనితీరుపై
# రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఆగ్రహం




గంగవరం, జూన్ 3 ,ప్రభాతవార్త :

ఉపాధ్యాయుల పనితీరుపై రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని గంగవరం, మేలుమాయి ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మేలుమాయి ఉన్నత పాఠశాలలో నాడు నేడు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌పై మండిపడ్డాడు. పాఠశాల గదిలో విద్యార్థులు కనిపించడంతో సెలవుల్లో విద్యార్థులను ఎందుకు పిలిపించారని, తాను ఆకస్మికంగా తనిఖీలకు వస్తుంటే విద్యార్థులు ఎందుకు రావాల్సి వచ్చిందని, విద్యార్థుల వద్ద ఉండవల్సిన పాఠ్యపుస్తకాలను వారి వద్ద నుండి ఏ విధంగా తీసుకుంటారని, ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే ప్రతి వస్తువు విద్యార్థి సొంతమని తిరిగి తీసుకోవడం నేరమంటూ డిఇఓ విజయేంద్రరావు, హెచ్‌ఎంలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల హక్కులను ఎవరూ భంగపరచరాదని, ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా అధికారులు పాఠశాలపై పర్యవేక్షణ తప్పనిసరన్నారు. విద్యార్థులలో సృజనాత్మకను వెలికి తీసి వారి భవిష్యత్తుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గంగవరం ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి జగనన్న విద్యాకానుక ద్వారా పాఠశాలకు వచ్చిన పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యునిఫామ్ దుస్తులను ఆయన పరిశీలించి అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, ఆర్జేడి వెంకటక్రిష్ణారెడ్డి, ఏపిడి వెంకటరమణరెడ్డిలతో పాటు మండల అధికారులు పాల్గొన్నారు.

## కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై శ్రీనివాసుని విహారం

### న కన్నుల పండుగలా శ్రీవారి కల్యాణం



వడమాలపేట, జూన్ 3 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి శనివారం ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం 4వ రోజు స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు పద్మావతి ఆండాళ్ సమేతంగా వాహన మండపం చేరుకున్న స్వామివారు సర్వంగా సుందరంగా అలంకృతుడై అలంకరించిన కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు.

### న స్వామివారికి వైభవంగా కల్యాణోత్సవం

అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. టీటీడీ ఆధీనంలో ఉన్న ఆ లయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణోత్సవ వేడుకలను భక్తులు తనివి తీరా తిలకించారు. సాయంత్రం 4.30 గంటల నుంచి శ్రీనివాసుని కల్యాణిన్న ప్రధాన అర్చకులు సూర్యకుమాచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఆర్జిత కల్యాణోత్సవం టికెట్లు తీసుకున్న దంపతులకు శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## చక్రస్నానంతో ముగిసిన గోవిందుని ఉత్సవాలు



తిరుపతి, జూన్ 3ప్రభాతవార్త :

గోవిందరాజస్వామి ఆలయంలో అత్యంత వేడుకగా జరిగిన బ్రహ్మోత్సవాలు చివరగా శనివారం ఉదయం కపిలతీర్థంపుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నాన మహోత్సవంతో ముగిశాయి. ఉదయం గోవిందరాజస్వామి ఆలయం నుండి ఊరేగింపుగా మంగళవాయిద్యా నడుమ బయలుదేరిన ఉత్సవర్లు, చక్రత్వాళ్వార్‌ను కపిలతీర్థం పుష్కరిణి వద్దకు వేంచేపుచేశారు. చక్రత్తాళ్వార్‌తో కలసి భక్తులు పుణ్యస్నానాలాచరించారు. రాత్రి ధ్వజావరోహణం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, కంకణభట్టార్ ఏపి శ్రీనివాస దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ రవికుమార్, సూపరింటెండెంట్ నారాయణ, ఆలయ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

## పున్నమి వెన్నెల్లో విహారించిన ముక్కంటీశుడు



శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త

'నిండుపున్నమి, ఆకాశంలో నెలరేడు తమ వెలుగులను విరజిమ్ముతుండగా దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుడు సోమాస్కందమూర్తిగా ఊంజల్‌సేవలో పాల్గొన్నారు. శనివారం పౌర్ణమి సందర్భంగా ఆలయంలోని కోట మండపం వద్దకు సోమాస్కందమూర్తిని అలాగే నాలుగు కాళ్ళ మండపం వద్దకు దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారిని అలంకార మండపంలో చక్కగా అలంకరించి చేర్చారు. అక్కడ వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా అర్చకులు, పౌరోహితులు, అధికారులు, పాలకులు పాల్గొనగా ఊంజల్ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులతోపాటు ఆర్డీవో కెఎస్. రామారావు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.




# చంద్రబాబుకు లక్ష మెజార్టీ ధ్యేయంగా పనిచేయాలి

- ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, జూన్ 3 ప్రభాతవార్త

తెదేపా అధినేత చంద్రబాబునాయుడుకు కుప్పంలో లక్ష మెజార్టీ సాధనే ధ్యేయంగా నేతలు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్సీ, కుప్పం సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో తెదేపా కార్యవర్గ సమావేశం జరిగింది. నేతలు, కార్యకర్తలతో కలసి పనిచేసేందుకు తాను సిద్ధమని ఎమ్మెల్సీ శ్రీకాంత్ పేర్కొన్నారు. మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో వైకాపా నేతల



గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయని చంద్రబాబు హామీలు ప్రజల్లో తీసుకెళ్లాలన్నారు. బిసిలకు తెదేపా అండగా ఉంటుందన్నారు. హైద రాబాదు నగరంను ఆనాడు చంద్రబాబు అభివృద్ధి చేశారని అభివృద్ధికి చంద్రబాబు మారుపేరన్నారు. ప్రశాంతంగా ఉన్న కుప్పంను అరాచక కుప్పంగా మార్చిన వారిని వదిలిపెట్టేది లేదన్నారు. గత ఎన్నికల్లో బూత్‌ల వారీగా వచ్చిన మెజార్టీల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికలకోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఎల్. జయరాంరెడ్డి, నాగరాజు, ఉయ్యాల జయరాంరెడ్డి, శివకుమార్, రాజు, గోపాల్, మణి, ఆనందరెడ్డి, సత్యేంద్రశేఖర్, రాజ్‌కుమార్, చంద్రశేఖర్, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, శ్యామలమ్మ, రూప, పొలారాణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను దేశం నేతలు ఘనంగా సత్కరించారు.

## అక్రమ కేసులు పెట్టిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

-జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పొన్నా యుగంధర్ డిమాండ్

వెదురుకుప్పం,జూన్ 3 ప్రభాతవార్త:



వెదురుకుప్పం మండలం,పెరుమాళ్లపల్లి గ్రామ నివాసి కల్తీ మద్యం తాగి మరణించాడని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన కొందరు విలేకర్లపై ఎస్ఐ లోకేష్,కార్వేటినగరం సిఐ చంద్రశేఖర్‌లపై చర్యలు తీసుకోవాలని గంగాధరనెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ పొన్నా యుగంధర్ డిమాండ్ చేశారు. విలేకర్లపై,అలాగే తనపై పెట్టిన అక్రమ కేసులను నిరసిస్తూ గత రెండు రోజులుగా పొన్న వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు.విషయం తెలుసుకున్న మండల తహసీల్దార్ పుల్లారెడ్డి దీక్ష చేస్తున్న ప్రదేశానికి వెళ్లి యుగంధర్‌ను పరామర్శించి,వైద్యులచే ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు.దీక్ష గురించి తహసీల్దార్ యుగంధర్‌ను అడగగా చెంగారెడ్డి అనే అతను కల్తీ మద్యం తాగి మరణించినట్లు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.ఈ విషయం వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసిన కారణంగా తమపై అక్రమ కేసులు పెట్టినట్లు యుగంధర్ వివరణ ఇచ్చారు.

## దాడులు చేసిన వారిపై హత్యాయత్నం

కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలి – గాలి భానుప్రకాష్

నగరి, జూన్ 3 ప్రభాతవార్త:



నగరి రూరల్ మండలం బీరకుప్పం పంచాయతీ కావేటి పురంకి చెందిన శరవణను కర్రలతో మూకుమ్మడిగా కిరాతకం గా దాడి చేసి తీవ్రంగా గాయపరచిన వైసీపీ ఎంపీటీసీ భర్త చంద్రారెడ్డి, అతని అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి శిక్షించాలని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ డిమాండ్ చేశారు. తిరుపతి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శరవణను ఆయన పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. బీసీ యువకుడిపై తీవ్రగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచన వైసీపీ వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, సామాన్య యువకులపై దాడులు, దౌర్జన్యాలు చేస్తుంటే పోలీసులు తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి వదిలేయడం, సిగ్గుచేటని ప్రజలకు న్యాయం చేయలేని వారికి అండగా ఉండలేని వారు ఉద్యోగాలకు రాజీనామా చేసి వెళ్లాలని సూచించారు. వీళ్ళ అరాచకాలు ప్రజలు విసిగిపోయారని వీళ్ళకి టైం దగ్గర పడిందని ఆయన పేర్కొన్నారు.

## దేశం కార్యకర్త హఠన్మరణం

శ్రీకాళహస్తి,జూన్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి చెందిన తెలుగుదేశం మద్దతు దారుడు కార్యకర్త శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ పాల సరఫరా సంఘానికి చాలా కాలం మేనేజర్‌గా పని చేసిన గరికపాటి రమేష్‌బాబు (54) శనివారం హఠాన్మరణం చెందారు.నిత్యభక్తుడుగా ఉన్న సుధాకర్ పట్టణ ప్రజలకు సుపరిచయస్థులు.తెలుగుదేశం పార్టీ మద్దతుదారుడుగా ఉన్న సుధాకర్ కొంత కాలం చిన్న చిన్న కాంటాక్టు పనులు చేసేవారు. కానీ ఆ పనులు కూడా చేయటం మానేసి సదాశివటవర్స్ వద్ద చిన్న హోటల్‌ను ప్రారంభించి నిర్వహిస్తున్నారు. ఆతని మృతికి బిజెపి నాయకుడు కోలా ఆనంద్‌కుమార్ తెలుగుదేశం నాయకులు, పలువురు పట్టణ ప్రముఖులు సంతాపాలు తెలిపారు.

## నిలువు నామాలతో ద్రవిడ ఉద్యోగుల నిరసన

కుప్పం, జూన్ 3 ప్రభాతవార్త



వేతనాల కోసం సమ్మె చేస్తున్న ద్రవిడ వర్సిటీ తాత్కాలిక ఉద్యోగు లు శనివారం నిలువు నామాలు ధరించి నిరసన తెలిపారు. 37 రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణ మన్నారు. బ్లాక్ గ్రాంట్ నుంచి వేతనాలు చెల్లించాలని ఉన్నత విద్యాశాఖ సూచించినా వర్సిటీ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. సోమవారం నుంచి సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. వర్సిటీ అధికారులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## మూడు చక్రాల వాహనం ఇప్పించండి సామీ !!

కుప్పంరూరల్, జూన్ 3 ప్రభాతవార్త



అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు ప్రభుత్వం తరపున మూడు చక్రాల వాహనం ఇప్పించాలని మండలంలోని బోదగుట్టపల్లికి చెందిన కదిరప్ప కోరుతున్నాడు. ఇతనికి 74శాతం మేర అంగవైకల్యం ఉంది. కుడి కాలు వైకల్యంతో బాధపడుతున్నాడు. నడిచేందుకు సైతం తనకు ఇబ్బందిగా ఉందని వాపోయాడు. గతంలో తాను మూడు చక్రాల వాహనం కోసం దరఖాస్తు చేయగా తనకు వాహనం రాకపోగా తనపేరిట వాహనం మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తనకు మూడు చక్రాల వాహనం మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నాడు.

## ద్రౌపది దేవి అమ్మవారి సేవలో నూకతోటి రాజేష్

వెదురుకుప్పం,జూన్ 3 ప్రభాతవార్త:



మండలంలోని చవటగుంట గ్రామంలో జరుగుతున్న మహాభా రతం ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీకృష్ణ ద్రౌపది ధర్మరా జుల ఆలయంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి నేత నూకతోటి రాజేష్ అమ్మవారిని దర్శించు కున్నారు. ఈ సందర్భ ంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ ధర్మకర్త బండి ఉమాపతిరెడ్డి రాజేష్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భానుప్రకాష్‌రెడ్డి, మునిరెడ్డి, కార్యనిర్వాహకులుధనుంజయరెడ్డి, బట్టే సుబ్రహ్మణ్యం, హరినాథరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షునికి కోలా ఘనస్వాగతం

శ్రీకాళహస్తి, జూలై 3 ప్రభాతవార్త

భారతీయజనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు శనివారం రైల్వేస్టేషన్‌లో బిజెపి శ్రీకాళహస్తి నియోజకవర్గ కన్వీనర్, రాష్ట్రమీడియా ప్రతినిధి కోలా.ఆనంద్‌కుమార్, జిల్లా అధ్యక్షులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, తిరుపతి నియోజకవర్గ కన్వీనర్ అజయ్‌కుమార్‌లతో కలసి శ్రీకాలహస్తి అసెంబ్లీ పార్టీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డిలు ఘనస్వాగతం పలికి ఆయనకు దుశ్శాలువతో సత్కరించారు. తిరుపతి సమీపంలో గల రామాపురంలో యోగ ఆశ్రమంలో జరుగుతున్న వివిధ క్షేత్రాల సమ్మేళనంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గణనాధుని సేవలో గుంటూరు జిల్లా కలెక్టర్

కాణిపాకం, జూన్ 3 ప్రభాతవార్త:



గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదివారం కుటుంబసమేతంగా గురువారం వేర్వేరుగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అలాగే ఆయన ప్రత్యేక గణపతిహోమంలో పాల్గొన్నారు. వారి వెంట సూపరెండెంట్ కోదండపాణి, ఐరాల తహశీల్దార్ సుశీల, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ప్రపంచ సైకిల్ దినోత్సవం ర్యాలీ

తవణంపల్లె, జూన్ 3 ప్రభాతవార్త:



మండల కేంద్రం తవణంపల్లెలో శనివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మండల వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని వైద్యశాఖ అధికారులు, సిబ్బంది స్థానిక పీహెచ్‌సీ నుండి తవణంపల్లె గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. చిన్నతనం నుండి సైకిల్ తొక్కడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులు దూరం అవుతాయని, శరీరంలో రోగ నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక పీహెచ్‌ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఎల్‌టీ శేఖర్‌లతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రొంపిచెర్లలో ప్రపంచ సైకిలు దినోత్సవం



రొంపిచెర్ల,జూన్ 3 ప్రభాతవార్త

మండల పరిదిలోని వారనాసివారిపల్లె శనివారం రొంపిచెర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిలు దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి రొంపిచెర్ల పురవీధులలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సైక్లింగ్ చేయండి గుండెజబ్బులు నివారించండి, అదిక క్యాలరీలు కరిగించండి, చక్కెర వ్యాధిని అదుపులో పెట్టుకోండి అనే నినాదాలతో ప్లే కార్డులు ప్రదర్శించారు. నినాదాలిచ్చారు. నడక, స్విమ్మింగ్, సైక్లింగ్, లాంటి శారీరక శ్రమ లేకపోవడం వల్లనే వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని అందుకే ప్రతి ఒక్కరు సైక్లింగ్ అలవరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు రాజా, దినేష్‌కుమార్, మండల ఆరోగ్య విద్యాదికారి రాజేశ్వరి, సీహెచ్ఓ కాంతమ్మ, పీహెచ్‌ఎన్ పార్వతమ్మ, ఎంపీహెచ్‌ఎస్ పంకజం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల పక్షపాతి సిఎం జగనన్న



– ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

కుప్పం, జూన్ 3 ప్రభాతవార్త

రైతుల పక్షపాతి సిఎం జగనన్న అని ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ పరిధి చీలేపల్లి ఆర్‌బికెలో రైతులకు ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న వేరుసెనగ విత్తనాల పంపిణీని వారు ప్రారంభించి ప్రసంగించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న ఘనత సిఎం జగనన్నదేనన్నారు. నాలుగేళ్ల కాలంలో ఏటా వర్షాలు సమృద్ధిగా కురిసి సుబిక్షంగా రైతులు పంటలసాగు చేసుకుంటున్నారన్నారు. రైతులకోసం రైతు భరోసా, పంటనష్టం చెల్లించడంతో పాటు రైతు భరోసా కేంద్రాలను గ్రామాల్లో ప్రారంభించి అన్ని ఎకరాల ఎరువులు, విత్తనాలు అక్కడే అందేలా చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, కుప్పం పరిశీలకుడు రెడ్డెప్ప, కౌన్సిలర్లు గణపతి, నాగరాజు, అరవింద్, నేతలు సర్దార్ బాషా, చలపతి, మునస్వామి, వేలు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఒడిసా రైలు దుర్గటన దురదుష్టకరం



–వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి జూన్ 3 ప్రభాతవార్త

ఒడిసా రైలు ప్రమాదర దురుదుష్టకరమని వైపిసి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు.రైలు ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలి పారు. కుటుంబ సభ్యులను సానుభూతి వ్యక్తం చేశారు. మృతులకు ఆత్మ శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్ధిస్తున్నట్లు తెలిపారు. రైలు దుర్గటన తన మన స్సును కలిచి వేసినట్లు ఆవేదన చెందారు.

## హజ్‌యాత్రికులకు ప్రభుత్వం అండ

– మైనార్టీ నాయకులు మొబిన్‌బాషా

కోట, జూన్ 3 ప్రభాతవార్త



రాష్ట్రం నుంచి తొలిసారిగా ముస్లింల కోసం హజ్‌యాత్రకు శ్రీకారంచుట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రకెక్కారని తిరుపతి పార్లమెంట్ మైనార్టీ సెల్ నాయకులు షేక్ మొబిన్‌బాషా అన్నారు. శనివారం గుంటూరులోని నంబూర్ మదరసాలో హజ్ యాత్రికులు బస చేసేందుకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషాను కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మొబిన్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలిసారిగా విజయవాడ నుంచి నేరుగా సౌదీకి హజ్‌యాత్ర కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం చారిత్రక నిర్ణయమని చెప్పారుజగన్‌మోహన్‌రెడ్డికికృతజ్ఞతలుతెలిపారు. కేంద్రప్రభుత్వ విధానాలతో రాష్ట్రం నుంచి హజ్‌యాత్రకు వెళ్లే వారికి ఒక్కొక్కరికి అదనపు భాగంగా ఉన్న రూ.80 వేలను తమ ప్రభుత్వమే భరించేందుకు ముందుకువచ్చిందన్నారు. ముస్లింల పవిత్ర కార్యానికి బాసటగా నిలుస్తున్న జగన్‌మోహ న్‌రెడ్డికి ముస్లింల ఆశీస్సులుఎల్లవేళలా ఉంటాయని అన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం, రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖమంత్రి అంజద్‌బాషాను సన్మానించారు. ఆయన వెంట షేక్ సిరాజ్, షేక్ ఇలియాజ్ తదితరులు ఉన్నారు.

## ఒడిస్సా రైలు ప్రమాద ఘటన అత్యంత దురదృష్టకరం

కోట, జూన్ 3 ప్రభాతవార్త

ఒడిస్సాలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద ఘటనలో సుమారు 300 మంది చనిపోవడం అత్యంత దురదృష్టకరమని కోట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎంపిటిసి సభ్యులు షేక్ షంషుద్దీన్ విచారం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైలు ప్రమాదంలో 50 మందికి పైగా తెలుగువారు మృతిచెందిన సమాచారం తనకెంతో బాధ కలిగిస్తోందన్నారు. ఈ సంఘటనపై కేంద్రప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

## సూళ్లూరుపేటలో రెడ్ల సంఘ ఐక్య చైతన్యయాత్ర

సూళ్లూరుపేట, జూన్ 3 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలో రాష్ట్ర రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఐక్య చైతన్య యాత్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డిని సన్మానించి రెడ్ల సంఘం చేపడుతున్న కార్యక్రమా లను వివరించారు. వ్యవస్థాపక అధ్యక్షులు గంగుల కుంట నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కులస్తు లందరూ పార్టీలకు అతీతంగా ఒక వేదిక మీదకు రావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో రెడ్లసంఘం పోరాటం ఫలితంగానే ప్రభుత్వం రెడ్ల కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ల సంఘం ప్రతినిధులు తమ్మినేని గోపాల్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, బండి దామోదర్‌రెడ్డి, ఎం.దిలీప్‌రెడ్డి, ఆదినారా యణరెడ్డి, బాబురెడ్డి, గాలి మల్లికార్జునరెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలు

కోట, జూన్ 3 ప్రభాతవార్త

గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ జన్మదిన వేడు కలను కోటలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి పార్లమెంటు మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జలీల్‌అహ్మద్ మాట్లాడుతూ గూడూరు ఎమ్మెల్యేగా పనిచేసిన మూడేళ్ల కాలంలోనే మూడుతరాలు గుర్తుంచుకునేలా అభివృద్ధి చేసి చూపించిన గూడూరు నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత సునీల్‌కుమార్ అని అన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక ట్యాక్సీస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జలీల్ అహ్మద్ మాట్లాడుతూ



గూడూరు నియోజకవర్గంలో ప్రధానంగా కోట మండలంలో సునీల్‌కుమార్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అధిష్టానం వద్ద పట్టుబట్టి నియోజకవర్గానికి కోట్లాది రూపాయల పనులు చేశారన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన సునీల్‌కుమార్ నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.కందల బాలకృష్ణ యాదవ్, షేక్ షంషుద్దీన్, నెల్లూరుమోహన్‌రెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, దారా సురేష్, సుహాసిని, పోలమ్మ, షేక్ బాబు, నౌషాద్, నాయబ్‌రసూల్, షేక్ మస్తాన్‌బాషా, శ్రీనివాసులు, చిట్టిబాబు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్లపై నిరంతర నిఘా

– డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు, జూన్ 3 ప్రభాతవార్త



రౌడీషీటర్లు తమ ప్రవర్తనలో మార్పు తెచ్చుకొని సమాజంలో జీవించాలని గూడూరు డీఎస్పీ సూర్య నారాయణరెడ్డి అన్నారు. శనివారం గూడూరులోని టూ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఆయన రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ రౌడీషీటర్లుగా ఉన్న వారి పట్ల నిరంతరం పోలీసు నిఘా ఉంటుందన్నారు. మద్యంసేవించి ఆగడాలు చేయడం, ఎక్కడైనా మితిమీరి ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవన్నారు. మీ వల్ల ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలు

గూడూరు, జూన్ 3 ప్రభాతవార్త

గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ జన్మదినం సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం పట్టణ టీడీపీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలు కలిసి భారీ కేక్ కట్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ జననమదినం సందర్భంగా పార్టీ కార్యాలయంలో వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గం అభివృద్ధి కోసం పాశం సునీల్‌కుమార్ ఎంతో కష్టపడ్డారని తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్ష నేతగా ఉంటూ ప్రజలకు, కార్యకర్తలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే స్పందించి సహాయం చేసే గొప్ప వ్యక్తి సునీల్‌కుమార్ అని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో సునీల్‌కుమార్‌ను గెలిపించుకొని గూడూరు నియోజకవర్గం అభివృద్ధికి కృషి కృషి చేస్తామన్నారు. పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌లో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గమళ్లపాలెం ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద యువత ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మైఫ్రెండ్ అసోసియేషన్ ఆశ్రమంలో ఉన్న పేదలకు దుప్పట్లు పంపిణీ, అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు తాతపూడి ఇస్రాయెల్ కుమార్, మహిళలు గుండాల లీలావతి, మట్టం శ్రావణిరెడ్డి, గుండాల శ్రీదేవి, పట్టణ ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహులు, చంద్రమౌళి, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఏసుపాక పెంచలయ్య, పట్టణ బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు శివప్రసాద్‌గౌడ్, పల్లి కోటేశ్వరరావు, యువత వేముల సునీల్, గుండాల సందీప్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గూడూరు ఆర్టీఓకి డీటీసీగా పదోన్నతి

గూడూరు, జూన్ 3 ప్రభాతవార్త



గూడూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారిగా పనిచేస్తున్న జిఆర్ రవీంద్రనాథ్ పదోన్నతిపై డీటీసీగా విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం జిల్లాలో ఆర్టీవోగా విధులు నిర్వహిస్తున్న జి.ఆదినారాయణ శనివారం గూడూరు ఆర్టీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్టీవోగా పనిచేసిన రవీంద్రనాథ్ మంచి అధికారిగా అందరి మన్ననలు అందుకున్నారు. కార్యాలయ సిబ్బందితో పాటు వాహనదారుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేసి మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అలాగే విజయనగరం జిల్లా నుంచి గూడూరుకు ఆర్టీవోగా వచ్చిన ఆదినారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించి సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా పదోన్నతిపై వెళుతున్న రవీంద్రనాథ్‌కు, బదిలీపై గూడూరుకు వచ్చిన ఆదినారాయణకు స్వాగతం పలుకుతూ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

## గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం

కాణిపాకం, జూన్ 3 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుపతి జిల్లా రామచంద్రాపురంకు చెందిన పవన్ కళ్యాణ్ అనే భక్తుడు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాత ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.దాత కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల పక్షపాతి మాజీ ఎమ్మెల్యే పాశం సునిల్ కుమార్

చిల్లకూరు, జూన్ 3, ప్రభాతవార్త

అధికారంలో వున్న ప్రతిపక్షంలో వున్న ప్రజల పక్షాన ఉంటున్న గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ అని తెలుగు దేశం పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి అన్నారు. శనివారం మండలంలోని ఓడూరు గ్రామ పంచాయితీలో లీలావతి ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి సునీల్ కుమార్ 54వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు దేశం ప్రభుత్వం హయాంలో ఎమ్మెల్యేగా



సునీల్ కుమార్ గూడూరు నియోజకవర్గానికి 2470 కోట్ల రూపాయిలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ప్రస్తుత వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమన్నారు. అదే విధంగా వరగలి క్రాస్ రోడ్డు వద్ద టిడిపి నాయకులు సునీల్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశులు రెడ్డి, టిడిపి నాయకులు గుండాల శ్రీనివాసులు, పాడిచర్ల రాఘవులు, మేకల కుమార్, అన్నం మునిశేఖర్, పిచ్చిరాజు, పట్నం సుమన్, చిట్టెటి శ్రీనివాసులు, దాసరి శైలజ, మునిశేఖర్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, దారా రవి, వీరబోయిన రవి, నరసమ్మ, తెలుగు యువత పాల్గొన్నారు.

## తొండమాన్‌పురంలో అన్నదాన పథకానికి శ్రీకారం

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 3 ప్రభాతవార్త



పురాణ ప్రసిద్ధి కలిగిన తొండమాన్‌పురంలో వెలసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన పథకానికి శ్రీకారం చుట్టారు. తొలిరోజు గ్రామస్తులు దాతలుగా వ్యవహరించారు. టిటిడి డిప్యుటీ ఈవో దేవేంద్రబాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటి రోజు తొండమాన్‌పురం గ్రామస్తులు విరాళంగా ఇచ్చి అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం కావడంతో భక్తులు విశేషసంఖ్యలో హాజరయ్యారు. ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా డిప్యుటీ ఈవో దేవేంద్రబాబు మాట్లాడుతూ అనుబంధ ఆలయాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. దాతలు ముందుకు వచ్చి ఈపథకాన్ని నిర్విఘ్నంగా జరిగేలా ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌రెడ్డి, సదాశివ స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి

పుత్తూరురూరల్, జూన్ 3 ప్రభాతవార్త:



విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి పుత్తూరు మండల పరిధిలో జరిగింది. పుత్తూరు సీఐ లక్ష్మీనారాయణ వివరాల మేరకు... పుత్తూర ఉమండలం తడుకు పంచాయతీ పరిధిలోని టీఆర్ కండ్రిగ(గుండాల కాలువ) ఎస్టీ కాలనీకిచెందిన సుబ్రహ్మణ్యం(45) ఇంటిలోనిద్రించే సమయంలో టేబుల్ ఫ్యాన్ స్విచ్ ఆన్ చేశారు. ఈ సమయంలో ఫ్యాన్ స్విచ్ షాక్ కొట్టింది. దీంతో అపస్మారక స్థితిలో వెళ్లాడు. దీంతోవెంటనే స్థానికులు పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. శవ పరీక్షలు నిర్వహించి బంధువులకు మృతదేహాన్ని అందించినట్లు పేర్కొన్నారు.

## శ్రీ గోవిందమాంబ సమేత వార్షికోత్సవాలు

పుత్తూరురూరల్, జూన్ 3 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ గోవింద మాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం భారీఊరేగింపు నిర్వహించారు. ఉదయం అభిషేకం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. స్వామివారి ఊరేగింపు ఆలయం వద్ద నుంచి పట్టణంలోని కాపు వీధి, బజారు వీధుల మీదుగా కొనసాగుతున్నట్లు తెలిపారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి రూరల్, జూన్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం అమ్మపాళెం గ్రామంలో శనివారం ఓ రైతు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు సమాచారం అందింది, అమ్మపాళెం గ్రామానికి వెళ్ళు మార్గంలో గిరిజన కాలనీ ఉంది. ఈ కాలనీలో యాతలూరు శ్రీనివాసులు(59) ఆతని భార్య నివాసముం టున్నారు. ఆతనికి నలుగురు పిల్లలు అందరికి వివాహాలయ్యాయి. అయితే ఇంటికి సంబంధించిన విద్యుత్ కనెక్షన్ వేలాడుతుండగా సరిదిద్దే క్రమంలో శ్రీనివాసులు షాక్‌కు గురయ్యారు. అక్కడికక్కడే మృతి చెందారు. దాంతో ఆ కుటుంబంలో విషాదం చోటు చేసుకుంది.

## రైల్వే మంత్రి రాజీనామా చేయాలి

కేంద్ర మాజీ మంత్రి డా. చింతామోహన్ డిమాండ్

తిరుపతి కలెక్టరేట్, జూన్ 3, ప్రభాతవార్త

ఒరిస్సా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవి నుంచి తప్పుకోవాలని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ డిమాండ్ చేసారు. గతంతో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మహబూబ్ నగర్ ప్రాంతంలో జరిగిన రైలు దుర్ఘటనకు లాల్ బహదూర్ శాస్త్రి తన పదవికి రాజీనామా చేశారు. మృతుల సంఖ్యను కేంద్ర ప్రభుత్వం దాచిపెడుతుందని రైలు ప్రమాదంలో 500కు పైగా చనిపోయారు. మరో వందలాదిమంది ఆసుపత్రిలో కాళ్లు, చేతులు, నడుము, మెడ, విరిగి తీవ్ర గాయాలు పాలై చావు బతుకుల్లో ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ప్రపంచంలోనే ఇంత పెద్ద రైలు ప్రమాదం ఎప్పుడు జరగలేదని ఇదే మొదటి సారన్నారు. కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్లక్ష్యం, అలసత్వం వల్లే ఇంత పెద్ద ప్రమాదం దుర్ఘటన జరిగి వందలాది మంది ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ప్రధానమంత్రి ఉత్తుత్తి పరామర్శలు నామమాత్రపు ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం బాధాకరమన్నారు. రైలు ప్రమాదం దుర్ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

## రోడ్లు, వీధులు శుభ్రంగా ఉంచండి

కమిషనర్ హరిత

రోడ్ల వెడల్పుకు సహకరించండి

డిప్యూటీ మేయర్ భూమన అభినయ్

తిరుపతి కార్పొరేషన్, జూన్ 3, ప్రభాతవార్త



తిరుపతి నగరంలోని అన్ని రోడ్లు, వీధులు శుభ్రంగా వుంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, తిరుపతి నగరంలో రోడ్ల వెడల్పుకు, కొత్త రోడ్ల నిర్మాణానికి సహకరించాలని తిరుపతి నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి కోరారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 42వ డివిజన్‌లో శనివారం సాయంత్రం కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, కార్పొరేటర్ శేఖర్ రెడ్డిలు పర్యటించారు. ఖాదీ కాలనీ ప్రధాన రహదారిలో జగన్మాత చర్చ్ ముందర నుండి ప్రకాశం పార్క్ వరకు వెలుతున్న 40 అడుగుల రహదారి 30 అడుగులకు కుంచించుకు పోవడంతో తిరిగి 40 అడుగుల వుండేలా వెడల్పు చేస్తున్నట్లు కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ ప్రకటించారు. సుమారు 50 మందికి టిడిఆర్ బాండ్లు రిలీజ్ చేసి వారందరి సహకారంతో రోడ్డు వెడల్పు కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా 42వ డివిజన్లో కొత్తగా 20 అడుగుల రోడ్డును పై వైశ్రాయ్ ప్రక్కనుండి కపిలితీర్థం రోడ్డును కలుపుతూ ఏర్పాటు చేస్తున్నట్లు తెలుపుతూ ఆ రహదారిని పరిశీలించడం జరిగింది. ఖాదీ కాలనీలో కాలువ సరిగ్గా ప్రవహించడం లేదని స్థానికులు పిర్యాదు చేయగా, అక్కడికి వెళ్లి చూసి వెంటనే ఆ కాలువను శుభ్రం చేయించాలని శానిటేషన్ అధికారులకు కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలోకార్పొరేటర్ శేఖర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు వెంకటరెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి, అసిస్టెంట్ సిటి ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, శానిటరీ సూపర్ వైజర్ చెంచెయ్య, వైసిపి నాయకులు గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త



పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయానికి మద్రాసు హైకోర్టు జడ్జి సి.కుమరప్పన్ కుటుంబ సభ్యులతో కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి దక్షిణగోపురం వద్ద ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంలో స్వామి అమ్మ వార్లను ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయాధికారు లు దక్షిణామూర్తి విగ్రహం వద్ద స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని అందించి వేదపండితుల ఆశీర్వచాలను అందించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో ఆలయ ఏపిఆర్ఓ గోపాల్ తదితరులు ఉన్నారు.

## ఓడిస్సా బాలాసోర్ సమీపంలో రైలు ప్రమాదంలో జిల్లాకు సంబంధించిన వారి సమాచారం నిమిత్తం హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాటు

జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణ రెడ్డి

తిరుపతి కలెక్టరేట్, జూన్ 3, ప్రభాతవార్త



ఓడిస్సా బాలాసోర్ సమీపంలో జరిగిన ఘోర రైలు దుర్ఘటనకు సంబంధించి జిల్లాకు చెందిన ప్రయాణికుల సమాచారం నిమిత్తం జిల్లా కలెక్టరేట్ నందు హెల్ప్ లైన్ నెంబర్లను ఏర్పాటు చేసామని జిల్లా కలెక్టర్ కె. వెంకట రమణ రెడ్డి తెలిపారు. జిల్లాకు చెందిన ప్రయాణికులు ఎవరైనా ఉన్నట్లైతే 6281156480 నెంబర్‌కు సమాచారం తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు.

## లోటు పాట్లు సరిదిద్దుకుని ముందుకెళ్తాం

-అందరికి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

-పాత్రికేయుల పరిచయ వేదికలో వైకాపా జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూన్ 3 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధే అజెండాగా ముందుకెళ్ళుతుందని, ఏవైన లోటు పాట్లు ఉంటే సరిదిద్దుకుని ప్రజల్లోకి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజాసంక్షేమ పథకాలలో, అభివృద్ధి పనులలో ఏవైన లోటుపాట్లు ఉంటే తెలియజేయాలని ఆయన కోరారు. శనివారం ప్రవేట్ హోటల్లో పాత్రికేయుల పరిచయ వేదిక సమావేశాన్ని ఏర్పాటు చేసారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రజలకు ఇంకా దరి చేరని పథకాలు ఉంటే తెలియజేయాలన్నారు. కుల,మత,పార్టీలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అర్హులందరికి అందజేస్తుందన్నారు. వైకాపా ప్రభుత్వం ప్రజలకు మరింత చెరువకాటానికి పాత్రికేయుల సహకారం అందించాలని కోరారు. సమాజంలో పాత్రికేయులు అనేక రుగ్మతలకు గురైతున్నారని, ముఖ్యంగా ఇండ్ల పట్టాలతో పాటు 60 సంవత్సరాలు పైబడిన పాత్రికేయులకు పెన్సన్ మంజూరు చేయాలని రామ్‌కుమార్‌రెడ్డిని పాత్రికేయ ప్రతినిధులు కోరారు. తిరుపతిలో పాత్రికేయుల ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపి.డాక్టర్ గురుమూర్తి జిల్లా అధ్యక్షుడుకి తెలియజేసారు. జర్నలిస్టుల ఇండ్ల సమస్యలను, 60సంవత్సరాలు పైబడిన జర్నలిస్టులకు పెన్సన్‌లు మంజూరు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళతానని నెదురమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తిరుపతి ఎంపి,డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆదిమూలం, వైకాపా సమన్వయ కర్త శైలజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సత్యవేడులో తెదేపా అధినేత చిత్రపటానికి పాలాభిషేకం

సత్యవేడు, జూన్ 3 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి శనివారం నియోజకవర్గ తెదేపా బీసి సెల్ అధ్యక్ష్యులు పరంధామ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఇటీవల తెదేపా విడుదల చేసి పార్టీ మేనిఫెస్టోలో బీసిలకు పెద్దపీట వేసిన సందర్భంగా సత్యవేడు గాంధీ కూడలి వద్ద అధినేత చంద్రబాబు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేపట్టి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ హెలెన్ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బీసిలకు, యువతకు అధిక ప్రాధాన్యత కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, మాజీ ఎంపిపి మస్తాన్, ఇళంగోవన్‌రెడ్డి, నరేంద్ర, తులసి, పృద్వి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు

-విద్యార్థులతో ఎమ్మెల్సీ డా॥సిపాయి సుబ్రహ్మణ్యం

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 3 ప్రభాతవార్త:

ఉన్నత చదువులతో ఉజ్వల భవిష్యత్తు పొందవచ్చని,ప్రతి మనిషికి విలువ,గౌరవం,హోదాలను తెచ్చిపెట్టేది చదువు మాత్రమేనని ఎమ్మెల్సీ,రష్ ఆసుపత్రి అధినేత డా॥సిపాయి సుబ్రహ్మణ్యం విద్యార్థులతో అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన జర్నలిస్టుల పిల్లలకు ఎమ్మెల్సీ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందచేశారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలకు ప్రతిభా పురస్కారాలను అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు మరింత ప్రోత్సా మాన్ని అందిస్తానన్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జె.భాస్కర్‌రెడ్డి,కె.బాలచంద్రలు మాట్లాడుతూ తాము ప్రెస్‌క్లబ్ అభివృద్ధి,సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి శ్రీకాంత్,కమిటీ సభ్యులు లావణ్యకుమార్,దినేష్,పరంధామరెడ్డి,సునీల్,రష్ ఆసుపత్రి వైద్యుడు డా॥బాబూరావు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో వర్ధమాన సినీ నటి

శ్రీకాళహస్తి,జూన్ 3 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత కాలసర్పదోష నివారణ పూజలు,రాహుకేతుదోష నివారణ పూజలకు విశేష స్పందన వస్తుంది. ఈ నేపథ్యంలో రాహుకాల సమయంలో వర్ధమాన సినినటి మెగా ఆకాష్ తన కుటుంబసభ్యులతో విచ్చేసి రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. ఆమెతోపాటు తమిళనాడుకు చెందిన జ్యోతిష్యులు సుబ్రమణ్యం ఉన్నారు. ఆయన గతంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రభుదేవాను పూజలకు తీసుకొచ్చి ప్రతి ఏడాది నిత్యాన్నదాన పథకానికి రూ.1.2లక్షల విరాళం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మెగా ఆకాష్‌కు ఆలయంలో సర్పదోష నివారణ పూజలు జరిపించారు. అలాగే భరద్వాజ మహామునిి తపస్సు చేసిన భరద్వాజేశ్వరుని సన్నిధిలో అభిషేకాలు జరిపించారు. ఇక్కడ రావి చెట్టు కింద ప్రతిష్ఠించిన నాగశిలలకు అభిషేకం జరిపించుకున్నారు. ఈ దివ్యక్షేత్రంలో నాగశిలలను కూడా ప్రతిష్టించుటకు వేదికను ఏర్పాటు చేసి ఉన్నారు. ఈ దివ్యక్షేత్రం ప్రాశస్త్యంను జ్యోతిష్యులు సుబ్రమణ్యం వివరించారు.

## నిత్యాన్న పథకానికి విరాళాలు

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నపథకానికి భక్తుల నుంచి విశేష స్పందన వస్తుంది. ఈ నేపథ్యంలో శనివారం పలువురు నిత్యాన్న ప్రసాదానికి విరాళాలను చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేసారు. పట్టణానికి చెందిన గజేంద్రనగర్ వాసులు తనమాల మునిసుందరమ్మ వారి కుటుంబసభ్యులు శనివారం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత చైర్మెన్‌తో తాము విరాళం ఇవ్వాలనుకుంటున్నట్లు వివరించారు. ఆయన చాంబర్‌లో రూ.లక్ష విరాళం అందజేసారు. వారికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసారు. వారికి శేష వస్త్రాలతో స త్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. కాగా చెన్నై నుంగం బాకం ప్రాంతానికి చెందిన వెంకటశివరామకృష్ణ వారి కుటుంబసభ్యులతో కలసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తరువాత చైర్మెన్‌తో చర్చించిన మీదట నిత్యాన్నదాం పథకానికి విరాళం అందిస్తామని తెలిపారు. వారు రూ.25వేలు విరాళం అందించారు. కాగా చెన్నై హైకోర్టు జడ్జి సి.కుమరప్పన్ కుటుంబసభ్యులతో కలసి శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. వారికి దర్శన ఏర్పాట్లను ఎపిఆర్ఓ గోపాల్ దర్శనాలను పర్యవేక్షించారు.

## వేలవేడులో అగ్నిగుండ మహోత్సవం

శ్రీకాళహస్తి రూరల్,జూన్ 3 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం వేలవేడు గ్రామంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో కోలాటాలు, భజనలు నేర్పటం జరుగుతుంది. వేలవేడు దళితవాడలో కొన్ని రోజులుగా భజన గురువు పెంచలయ్యదాస్‌చే యువతీ యువకులు, చిన్నారులు భజన నేర్చుకున్నారు. ఈ సందర్భంగా పాండురంగస్వామి సమేత రుక్మిణి ఆలయంలో భజనతో పాటు అగ్నిగుండ ప్రవేశం ఏర్పాటు చేసారు. గత ఆరేళ్ళుగా ఇక్కడ అగ్నిగుండ మహోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామానికి చెందిన వారే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భజజ నేర్చుకొవటానికి యువకులు వచ్చారు. ఇది కన్నుల పండువగా సాగింది.

## పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ముందుకురావాలి

శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త



రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలి ఆదేశాను సారం ఈనెల 5వతేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా రీజనల్ మేనేజర్ ఆధ్వర్యంలో జిల్లాలో కళాజాత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ వీధినాటికలు విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో మ్యాజిక్ ద్వారా హాస్యసన్నివేశాలతో, ఆటలతో, పాటలతో జనరంజకంగా జనం కూడళ్ళలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. శనివారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణంలో స్థానిక సూపర్‌బజారు కూడలి, బిక్షాలగోపురం, సన్నిధివీధుల్లో ముఖ్యంగా ప్లాస్టిక్‌వాడకం వల్ల ప్రజలు తెలియకుండానే కాలుష్య ఉచ్చులో చిక్కుకుపోతున్నారని, అలాగే సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

## జాతీయ ఉపకారవేతనానికి పిల్లమేడు విద్యార్థిని ఎంపిక

తొట్టంబేడు, జూలై 3 ప్రభాతవార్త

మండలంలోని పిల్లమేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న మోదుగులజాహ్నవి(ఎన్ఎంఎస్ఎస్) జాతీయ ఉపకారవేతనానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు అక్తర్ అలీఖాన్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎక్కువగా పోటీ ఉండే ఈ పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థిని సత్తా చాటడం ఎంతో సంతోషమన్నారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో జాహ్నవిని ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. గుణాత్మక విద్య కారణంగానే తమ విద్యార్థి జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైందన్నారు.

# తిరుపతి డివిజన్

## 50 సంవత్సరాలలో జరగని అభివృద్ధి తిరుపతిరూరల్లో జరిగింది

-ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైకాపా ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూన్03 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలంలో 50 సంవత్సరాలలో జరగని అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. మండలంలో కనీవిని ఎరుగని రీతిలో రూ.79.05కోట్ల రుపాయాలతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. శనివారం ఎంపిడిఓ సమావేశ మందిరములో సాధారణ సర్వసభ్య సమావేశం మండలాధ్యక్షుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతిరూరల్ మండలంలో ప్రజాప్రతినిధుల ఆరోగ్య పరిరక్షణకు తిరుపతిరూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్ చొరవ తీసుకున్నారని తెలిపారు. పంచాయతీల పరిధిలో సర్పంచ్‌లు, ఎంపిటిసి ఆరోగ్యంగా ఉంటే ప్రజలకు మరింత సేవ చేసేందుకు అవకాశం ఉంటుందని భావించారు. రూ.5లక్షల వరకు నగదు రహిత వైద్య సేవలు ప్రజాప్రతినిధుల (భార్యభర్తలకు) వర్తింపేజేసే వైద్య భీమా ప్రీమియం ప్రతిని సర్పంచ్, ఎంపిటిసిలకు ఎమ్మెల్యే, ఎంపిపి చేతుల మీదగా అందజేసారు. శెట్టిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మిట్టగాంధీపురంలో దళితులకు కేటాయించిన ఏక్‌సాలు పట్టాలు పునరుద్ధరించాలని శెట్టిపల్లి ఎంపిటిసి ప్రళయకావేరి నారాయణరెడ్డి కోరారు.

***-తిరుపతిరూరల్లో రూ.79.05.24000 కోట్ల నిధులతో***

**అభివృద్ధి పనులు**

తిరుపతిరూరల్ మండల పరిధిలో రూ.79కోట్ల5లక్షల 24వేల రుపాయాల నిధులతో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి తెలిపారు. వైకాపా ప్రభుత్వ పాలనలో కులం, మతం, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు.

-గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే అసహనం

మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారుల పట్ల ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేసారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు తెలియజేయాని, కలెక్టర్ బాధ్యతయుతంగా వ్యవహరించిన ఫారెస్ట్, ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. మూడు నెలలకు ఓసారి జరిగే మండల సమావేశానికి మండల అధికారులందరూ హాజరుకావాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు విడుదల మాధవరెడ్డి, యశోధ, ఎంపిడిఓ వెంకటనారాయణ, తిరుపతిఅర్బన్, రూరల్ తహశీల్దార్స్ వెంకటరమణ, టివి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## ఘనంగా చెంచులక్ష్మి అమ్మవారి తిరునాళ్ళు

నింద్ర,జూన్ 3 ప్రభాతవార్త :



మండలంలోని అత్తూరు యస్‌టి కాలనీలో ఘనంగా చెంచులక్ష్మి అమ్మవారి తిరునాళ్ళు ఉత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. చెంచులక్ష్మి అమ్మవారి తిరునాళ్ళు ఉత్సవం గత మూడు రోజులుగా యస్‌టి కాలనీలోని భక్తులు భక్తి శ్రద్ధలతో మూడు రకాలుగా పద్ధతగా ఊరెగింపు చేసారు. ఈసందర్భంగా యానాది కాలనీలో వీదులలో రంగురంగుల విద్యుత్ దీపాలం కరణతో శోభాయమానంగా అలంకరించినారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ముని కన్నయ్య,పూజారులు వరదయ్య,ఆరుముగం,కప్పంకట్టన భక్తులు కె.కన్నయ్య, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషన్‌ను అరెస్ట్ చేయాలి

-సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటరత్నం డిమాండ్

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 3 ప్రభాతవార్త:



అంతర్జాతీయ క్రీడల్లో భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి పథకాలను సాధించిన మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బిజెపి ఎంపి,డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌ను తక్షణం అరెస్ట్ చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ తిరుపతి నగర కార్య దర్శి పాటూరి వెంకటరత్నం డిమాండ్ చేశారు. ఈ దుశ్చర్యను వ్యతిరేకిస్తూ శనివారం ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మహిళలకు సముచిత స్థానం కల్పిస్తోందని,బేటీ పడావో బేటీ బచావో అని మాటల్లో చెప్పుకోవడమే తప్ప,మహిళల మాన ప్రాణాలకు ముప్పు వాటిల్లుతున్నా..ప్రధాని మోడీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు నాయకులుకుడువిజయ్‌కుమార్,రాజగోపాల్,మునికుమార్, లోకేష్, మహేష్,వెంకటేష్,లత పాల్గొన్నారు.

## రైలు ప్రమాద సంఘటనకు కేంద్రం బాధ్యత తీసుకోవాలి

-కేంద్ర రైల్వే శాఖా మంత్రి తక్షణం రాజీనామా చేయాలి

-ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ డిమాండ్

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 3 ప్రభాతవార్త:



ఒడిస్సాలో కోరమండల్,యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్,గూడ్సు రైళ్ల ప్రమాదానికి గురైన దుర్ఘటనలో వందలాది మంది ప్రయాణీకుల మృతికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని,అలాగే కేంద్ర రైల్వే శాఖా మంత్రి తక్షణం రాజీనామా చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయపనేని హరికృష్ణ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలోని ప్రజల ప్రాణాలను పట్టించుకోకుండా,కనీస సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని దుయ్యబట్టారు. దేశంలోని రైల్వే ట్రాక్‌ల రక్షణ,సిబ్బంది,గ్యాంగ్‌మెన్ల కుదింపు,రైల్వేల ప్రైవేటీకరణ,కాంట్రాక్టీకరణ ఫలితమే ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతోందని మండిపడ్డారు. రైలు ప్రమాదంలో మృతిచెందిన వందలాది మంది మృతులకు50లక్షలు,క్షతగాత్రులకు25లక్షల చొప్పున పరిహారం అందచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## రైలు ప్రమాద బాధితుల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 3 ప్రభాతవార్త:



ఒరిస్సాలో జరిగిన హౌరా రైలు ఘోర ప్రమాదం నేపథ్యంలో సిఎం జగన్ ఆదేశాల మేరకు తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తి శనివారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. ఎంపి సూచన మేరకు అధికారులు తక్షణం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితులు ఎవరైనా ఉన్నారా అనే వివరాలు ఎంపి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతులు,క్షతగాత్రులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే రైల్వే రిజర్వేషన్ వివరాలను స్టేషన్ డైరెక్టర్ కె.సత్యనారాయణ,ఇతర రైల్వే అధికారులు ప్రయాణీకుల వివరాలను ఎంపికి తెలియచేశారు. ఇందులో తిరుపతి నుండి 18 మంది,రేణిగుంట నుండి 8 మంది, గూడూరు నుండి ఇద్దరు ప్రయాణీకులతో కలిపి తిరుపతి జిల్లాలో 28 మంది హౌరా రైలులో ప్రయాణించారు. వీరందరూ సురక్షి తంగా ఉన్నారని ఎంపి తెలుసుకున్నారు. వీరికి అవసరమైన సహాయ సహకారాలు తిరుపతి రైల్వే అధికా రులు అందిస్తున్నారు. సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బాల శ్రీమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## 400 సంవత్సరాల పొన్న కాల్వ మండపానికి పూర్వ వైభవం తేవాలి

పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగి రెడ్డి

తిరుచానూరు, జూన్ 3, ప్రభాతవార్త



తిరుపతి శివారు తిరుచానూరు గ్రామ పంచాయితీ పరిధిలోని స్వర్ణముఖి నది తీరాన ఉన్న పొన్న కాల్వ మండపానికి అందంగా తీర్చిదిద్దాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా పౌండేషన్ సిఈవో డా. ఈమని శివనాగి రెడ్డి అన్నారు. స్థానిక వారసత్వ కార్యకర్త బివి రమణ ఇచ్చిన సమాచారం మేరకు ఆయన శనివారం ఆ మండపాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీశ 16వ శతాబ్ది నాటి ఈ మండపం గోవిందరాజస్వామి పొన్న కాల్వ ఉత్సవం జరుపుకునే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతుందని, ప్రతి ఏటా చిత్ర పౌర్ణమి పర్వదినం సందర్భంగా తిరుపతి నుంచి గోవిందరాజుల స్వామి, శ్రీ దేవి భూదేవి సమేత ఆండాళ్ అమ్మవారు, శ్రీ కృష్ణ స్వామి వారు విస్వక్సేనులు తదితర తొమ్మిది మంది దేవేరులు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నపన తిరుమంజనం, ఊంజల్ సేవ, వేడుక నిర్వహించడం అనంతరం దేవత మూర్తులు వెంచెపుగా పొన్న కాల్వ నుండి తిరుచానూరు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుంటారు. భావ గారైన గోవిందరాజు స్వామి వారి రాకకోసం అమ్మవారు ఒక ద్వారం మూసి ఉంచి వేచి చూస్తున్నట్లు సాంప్రదాయంతో అధికారులు బపూజలు నిర్వహించి ఆలయం మాడ వీధుల్లో విహరిస్తూ అక్కడ నుండి తిరుపతికి చేరుకోవడం ఆనవాయితీగా వస్తుందని టిటిడి దేవస్థాన చరిత్రకారులు ఎస్. గోపికృష్ణ తెలిపినట్లు చెప్పారు. 400 సంవత్సరాల ఈ మండపాన్ని కాపాడుకోవాలని పునరుద్ధరించి కలశాన్ని ప్రతిష్టించాలని టిటిడి అధికారులను విజ్ఞప్తి చేశారు. పూర్వ అటవీ శాఖ అధికారి చంద్రమోహన్ రెడ్డి, తిరుపతి శిల్ప కళాశాల ఆచార్యులు డా. సుబ్రమణి స్థపతి, తిరుపతి శిల్పారామం అధికారి ఖాధర్ వలీ పాల్గొన్నారు.

## విద్యార్థులు యువతకు రాస్ ద్వారా మార్గదర్శక శిక్షణ

రేణిగుంట, జూన్ 3 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం కరకంబాడి బాలాజీ వికాస్‌కార్యాలయంలో చైల్డ్ ఫండ్ ఇండియా ఆర్థిక సహాయంతో రాస్ దత్తత గ్రామాలపదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు, యువకులకు భవిష్యత్ కెరీర్‌పై ప్రాజెక్టు మేనేజర్ జయచంద్రనాయుడు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఎస్ఎస్ఆర్‌సంస్థ ప్రతినిధులు గణేష్, పద్మావతి సదస్సులో అంశాలను వివరించారు. నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు పదో తరగతి, ఇంటర్ భవిష్యత్‌కు పునాదులు అన్నారు. తమ కెరీర్ బాగా ఉండాలంటే ఆలోచించి నిర్ణయించుకోవాలన్నారు. తద్వారా మంచి భవిష్యత్ లభిస్తుందన్నారు.

